సాక్షి విశాఖపట్నం

శనివారం ♦ 11 ♦ అక్టోబర్ ♦ 2025



గంటా ఇంటి వద్ద వీధివ్యాపారుల నిరసన 8లో



ప్రభుత్వ భూమిలో టీడీపీ నాయకుల దౌర్జన్యం 8లో



బంగారంలాంటిమాట.. అనసూయ నోట.. 8లో

న్యూస్‌రీల్

ఏసీఎఫ్‌ఐ ఏపీ చాప్టర్ చైర్మన్‌గా సాంబశివరావు



సాక్షి, విశాఖపట్నం : ఎయిర్ కార్గో ఫోరం ఇండియా(ఏసీఎఫ్‌ఐ) ఆంధ్రప్రదేశ్ చాప్టర్ చైర్మన్‌గా జి.సాంబశివరావు ఎన్నికయ్యారు. ఈ మేరకు ఏసీఎఫ్‌ఐ ప్రధాన కార్యాలయం శుక్రవారం ప్రకటించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏపీలో ప్రస్తుతం విశాఖపట్నం, రాజమండ్రి, విజయవాడ, తిరుపతి అంతర్జాతీయ విమానాశ్రయాలు ఎగుమతి దిగుమతుల్లో కార్గో కార్యకలాపాలకు అపారమైన అవకాశాలు కల్పిస్తున్నాయన్నారు. ముఖ్యంగా ఫార్మా ఉత్పత్తులు, సముద్ర ఉత్పత్తులు (రొయ్యలు, చేపలు), పూలు, మొక్కలు, పరిశ్రమలు, నౌకా స్పేర్స్ వంటి వస్తువుల ఎగుమతితో పాటు బంగారం, వెండి, వజ్రాలు వంటి వస్తువుల దిగుమతులు విస్తృతంగా జరుగుతున్నాయన్నారు. వీటి ద్వారా రాష్ట్ర ఆర్థిక కార్యకలాపాలు పెరగడంతో పాటు స్థానిక యువతకు, మహిళలకు, లాజిస్టిక్స్ రంగంలో ఉపాధి అవకాశాలు ఏర్పడేందుకు కృషి చేస్తానన్నారు. ఏపీలో ఎయిర్ కార్గో కనెక్టివిటీ మెరుగుపడితే, ఇది పరిశ్రమలు, ఎంఎస్ఎంఈలు, స్టార్టప్‌లకు ఉపయోగకరంగా ఉంటుందని, ఉత్తరాంధ్ర జిల్లాలకు అవకాశాలు కలుగుతాయన్నారు.

మరో 10 మంది విద్యార్థినుల డిశ్చార్జ్

మహారాణిపేట : పచ్చకామెర్లతో కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న కురుపాంలోని గిరిజన సంక్షేమ బాలికల వసతి గృహానికి చెందిన మరో 10 మంది విద్యార్థులను శుక్రవారం పార్వతీపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. ఇప్పటివరకు పలు విడతల్లో 33 మందిని పంపినట్టు కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఐ.వాణి తెలిపారు. విద్యార్థులకు పచ్చకామెర్లు వ్యాధి తగ్గడంతో వైద్యులు ఇచ్చిన నివేదికల ప్రకారం తరలించామన్నారు. నాలుగు విడతల్లో కేజీహెచ్‌కు మొత్తం 65 మంది విద్యార్థులు వచ్చారని, 33 మందిని పార్వతీపురం పీహెచ్‌సీకి పంపించగా.. ఇంకా 32 మంది చికిత్స పొందుతున్నారన్నారు.

జూలో అభివృద్ధి పనులకు ఈ-టెండర్లు

ఆరిలోవ : జూ పార్కులో పలు అభివృద్ధి పనులకు ఈ-టెండర్లు పిలుస్తున్నట్లు క్యూరేటర్ జి.మంగమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. బ్లాక్‌బర్గ్ ఎన్‌క్లోజర్‌లో అదనపు నైట్ షెల్టర్, మౌస్ డీర్ ఎన్‌క్లోజర్‌లో పైకప్పు, ఖడ్గమృగం ఎన్‌క్లోజర్ వద్ద బయట ఫ్లాట్‌ఫారం, కణుజుల ఎన్‌క్లోజర్‌లో నైట్ షెల్టర్ నిర్మాణాలు రూ.54.80 లక్షలతో చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల వారు ఈనెల 21న మధ్యాహ్నం 2 గంటలలోగా టెండర్లు వేయాలని సూచించారు. వివరాలకు 9866071126 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

ఏయూలో 17న ఎన్‌ఎస్టీఎల్ అకడమిక్ కాన్ఫరెన్స్



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న ఏయూ వీసీ రాజశేఖర్

మద్దిలపాలెం: ఆంధ్ర విశ్వవిద్యాలయం నేవల్ సైన్స్ టెక్నలాజికల్ లేబరేటరీ (ఎన్ఎస్టీఎల్) సహకారంతో ఈనెల 17వ తేదీన ఎన్ఎస్టీఎల్ అకడమిక్ కాన్ఫరెన్స్- 2025ను నిర్వహిస్తున్నట్లు ఎన్ఎస్టీఎల్ డైరెక్టర్ డాక్టర్ అబ్రహం వర్గీస్ తెలిపారు. బీచ్ రోడ్డులోని ఏయూ కన్వెన్షన్ సెంటర్ వేదికగా సదస్సు నిర్వహించనున్నామన్నారు. బ్రోచర్, రిజిస్ట్రేషన్‌కు సంబంధించిన వెబ్‌సైట్‌ను ఎన్ఎస్టీఎల్ డైరెక్టర్ డాక్టర్ అబ్రహం, ఏయూ వీసీ జీపీ రాజశేఖర్ ఆవిష్కరించారు. శతాబ్ది ఉత్సవాలు జరుపుకుంటున్న తరుణంలో ఇటువంటి సాంకేతిక కార్యక్రమం విశ్వవిద్యాలయానికి మరింత ప్రతిష్టను అందిస్తుందని వీసీ చెప్పారు.

సివిల్స్ శిక్షణకు బ్రేక్

ఏపీ స్టడీ సర్కిల్ నిర్వీర్యం

- ఎస్సీ, ఎస్టీ, బీసీ నిరుద్యోగ యువతకు కూటమి సర్కారు దగా
- యూపీఎస్సీ, గ్రూపు–1, 2లకు దక్కని శిక్షణ
- వైఎస్సార్ సీపీ హయాంలో మూడు ధపాలు సివిల్స్, గ్రూప్స్ పరీక్షలకు శిక్షణ
- గత ప్రభుత్వ ప్రోత్సాహంతో పలువురు అభ్యర్థులు ఉద్యోగాలకు ఎంపిక

కూటమి ప్రభుత్వం ఏపీ స్టడీ సర్కిల్ మనుగడనే ప్రశ్నార్థకం చేస్తోంది. ఈ కేంద్రాన్ని నిర్వీర్యం చేసే దిశగా అడుగులు వేస్తోంది. యూపీఎస్సీ, ఏపీపీఎస్సీ పరీక్షలకు ఉచిత శిక్షణా తరగతులను పూర్తిగా ఎత్తేసింది. దీంతో స్టడీ సర్కిల్ నోటిఫికేషన్ కోసం ఎదురుచూస్తున్న వందల మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ నిరుద్యోగ గ్రాడ్యుయేట్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే నోటిఫికేషన్ ఇవ్వకుంటే పెద్ద ఎత్తున ఉద్యమించేందుకు సిద్ధమవుతున్నారు.



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో విశాఖలో నిర్మించిన ఏపీ స్టడీ సర్కిల్ భవనం

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం:

ఇంటికో ఉద్యోగం లేదంటే నిరుద్యోగ భృతి ఇస్తామని నమ్మబలికిన చంద్రబాబు సర్కారు ఉద్యోగాలు కాదు కదా.. కనీసం నిరుద్యోగ యువతకు శిక్షణ కూడా ఇవ్వకుండా అడ్డుపడుతోంది. వైఎస్సార్ సీపీ హయాంలో ఎంతోమంది నిరుద్యోగులకు ఉద్యోగాలు అందించిన ఏపీ స్టడీ సర్కిల్ మనుగడనే కూటమి సర్కారు ప్రశ్నార్థకంగా మార్చేసింది. యూపీఎస్సీ సివిల్స్, ఏపీపీఎస్సీ గ్రూప్–1, 2 శిక్షణ తరగతులను పూర్తిగా ఎత్తి వేయడంతో ఎస్సీ, ఎస్టీ, బీసీ నిరుద్యోగ గ్రాడ్యుయేట్లకు ఉచిత శిక్షణ అందకుండా పోయింది. 2019లో వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక ఏపీ స్టడీ సర్కిల్‌కు పునరుజ్జీవం కల్పించింది. మన రాష్ట్రానికి చెందిన యువత కోసం విశాఖలో ఏపీ స్టడీ సర్కిల్ భవన నిర్మాణాన్ని చేపట్టింది. రుషికొండ ప్రాంతంలో రెండు ఎకరాల స్థలాన్ని కేటాయించి సుమారు రూ.3 కోట్లతో అత్యాధునిక హంగులతో స్టడీ సర్కిల్ భవనాన్ని 2021లో నిర్మించింది. పరిపాలన భవనంతో పాటు వసతి గృహానికి సంబంధించి రెండు భవనాలను జీ+2 విధానంలో అందుబాటులోకి తెచ్చింది. గత ప్రభుత్వం వరుసగా మూడేళ్ల పాటు ఈ కేంద్రంలో సివిల్స్ పరీక్షలకు సిద్ధమయ్యే ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ తరగతులు నిర్వహించగా పలువురు ఉద్యోగాలు కూడా సాధించారు.

నిరుద్యోగుల పడిగాపులు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఏపీ స్టడీ సర్కిల్ తీవ్ర నిర్లక్ష్యానికి గురవుతోంది. ఎస్సీ, ఎస్టీ, బీసీ గ్రాడ్యుయేట్లకు ఉచిత శిక్షణ తరగతులను నిలిపివేసింది. 2024–25లో సివిల్స్ ఉచిత వసతి శిక్షణ నోటిఫికేషన్ విడుదల చేయలేదు. ఈ ఏడాది ఇప్పటి వరకు ఆ ఊసే లేదు. స్టడీ సర్కిల్ నోటిఫికేషన్ కోసం వందల మంది నిరుద్యోగ గ్రాడ్యుయేట్లు పడిగాపులు కాస్తున్నారు. వెంటనే నోటిఫికేషన్ విడుదల చేయాలని ఏపీ స్టడీ సర్కిల్స్ స్టూడెంట్స్ ఫోరం ప్రతినిధులు ఆందోళనకు దిగుతున్నారు.

ఉద్యమించేందుకు సన్నద్ధం

ఏపీ స్టడీ సర్కిల్ నోటిఫికేషన్ కోసం నిరుద్యోగులు మొత్తుకుంటున్నా ఆలకించని కూటమి సర్కారు అంబేడ్కర్ స్టడీ సర్కిళ్ల ద్వారా సాధారణ పోటీ పరీక్షలకు శిక్షణ ఇస్తామని చెబుతోంది. సివిల్స్, గ్రూప్స్ శిక్షణకు అవకాశం కల్పించకుండా కేవలం ఐబీపీఎస్, ఆర్ఆర్‌బీ, ఎస్ఎస్‌సీ, బ్యాంకు ఉద్యోగాల పరీక్షలకు ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీ అభ్యర్థుల నుంచి ఇటీవల దరఖాస్తులు ఆహ్వానించింది. అది కూడా ప్రిలిమ్స్ కాకుండా కేవలం మెయిన్స్ మాత్రమే శిక్షణ ఇవ్వాలని నిర్ణయించడం పట్ల నిరుద్యోగుల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. కూటమి ప్రభుత్వం ఏపీ స్టడీ సర్కిల్‌ను నిర్వీర్యం చేస్తోందని మండిపడుతున్నారు. దీనిపై పెద్ద ఎత్తున ఉద్యమించేందుకు సిద్ధమవుతున్నారు.

వెంటనే నోటిఫికేషన్ ఇవ్వాలి

తక్షణమే ఏపీ స్టడీ సర్కిల్ నోటిఫికేషన్ విడుదల చేయాలి. నోటిఫికేషన్ రాకపోవడంతో నిరుద్యోగ గ్రాడ్యుయేట్లు సివిల్స్, గ్రూప్స్ పరీక్షల శిక్షణకు దూరమవుతున్నారు. ప్రైవేట్ సంస్థల్లో శిక్షణ పొందే స్తోమత లేక ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ అభ్యర్థులు నష్టపోతున్నారు. కూటమి ప్రభుత్వం సివిల్స్ ఉచిత వసతి శిక్షణ నోటిఫికేషన్ వెంటనే ఇవ్వాలి.



– కొల్లు ఆనంద్‌కుమార్, అధ్యక్షుడు, ఏపీ స్టడీ సర్కిల్ స్టూడెంట్స్ ఫోరం

ఆరోగ్యశ్రీ సేవలకు అంతరాయం

- ఆస్పత్రుల్లో అడ్మిషన్ల బంద్
- 27 ఆస్పత్రుల్లో అందని వైద్య సేవలు
- వెనుదిరిగిన పేద రోగులు

మహారాణిపేట: ఆరోగ్యశ్రీ పథకంలో వైద్య సేవలకు శుక్రవారం తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఎన్టీఆర్ ఆరోగ్య శ్రీ ట్రస్ట్ నుంచి రావాల్సిన కోట్ల రూపాయల బకాయిలను కూటమి ప్రభుత్వం సకాలంలో చెల్లించకపోవడంతో, ఆంధ్రప్రదేశ్ స్పెషాలిటీ ఆస్పత్రుల అసోసియేషన్ (ఆషా) ఆధ్వర్యంలో నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో సేవలను నిలిపివేశాయి. దీంతో చికిత్స కోసం ఆస్పత్రులకు వెళ్లిన పేద రోగులు ఓపీ సేవలు దొరక్క నిరాశతో వెనుదిరిగారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రైవేటు ఆస్పత్రులకు చెల్లించాల్సిన బకాయిలను పెండింగ్‌లో పెట్టింది. ఆస్పత్రులకు ఆర్థిక భారం పెరగడంతో ఆంధ్రప్రదేశ్ స్పెషాలిటీ ఆస్పత్రుల అసోసియేషన్ (ఆషా) సేవలు నిలిపివేయాలని కీలక నిర్ణయం తీసుకుంది. ఆరోగ్యశ్రీ, ఉద్యోగ ఆరోగ్య పథకం కింద సేవలను నిలిపివేస్తూ రాష్ట్రవ్యాప్తంగా నెట్‌వర్క్ ఆస్పత్రులకు ఆదేశాలు జారీ చేసింది.ఈ సేవలు నిలిపివేయడంతో, పేదలు, ప్రభుత్వ ఉద్యోగులు చికిత్స పొందడానికి తీవ్ర ఇబ్బందులు పడే పరిస్థితి ఏర్పడింది. ఆరోగ్య శ్రీ సేవలకు బ్రేకు పడటంతో జిల్లా నెట్‌వర్క్ ఆస్పత్రులపై నీలినీడలు కమ్ముకున్నాయి. జిల్లా పరిధిలో ఆరోగ్యశ్రీ కింద 63 ఆస్పత్రులు నెట్‌వర్క్‌లో ఉండగా, మొదటి రోజు అత్యవసర సేవలను మాత్రమే స్వీకరించారు. ఇందులో 27 నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో ఓపీ, ఐపీ సేవలను పూర్తిగా నిలిపివేశారు. చికిత్స కోసం వచ్చిన ఎంతో మంది రోగులు నెట్‌వర్క్ ఆస్పత్రుల నుంచి నిరాశగా తిరిగి వెళ్లాల్సి వచ్చింది. రోగులకు ఇబ్బందులు కలగకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశామని జిల్లా ఆరోగ్య సమన్వయకర్త డాక్టర్ అప్పారావు తెలిపారు.

వచ్చే నెల 22 నాటికి కోటి సంతకాల సేకరణ పూర్తి

- వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కార్యక్రమాలు
- జగన్ పర్యటన విజయవంతంపై అందరికీ కృతజ్ఞతలు
- ఉత్తరాంధ్ర నేతలతో వైఎస్సార్ సీపీ రీజినల్ కోఆర్డినేటర్ కన్నబాబు టెలికాన్ఫరెన్స్

సాక్షి, విశాఖపట్నం: నర్సీపట్నంలో వైద్య కళాశాల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈనెల 9వ తేదీన చేపట్టిన పర్యటనను విజయవంతం చేసిన పార్టీ శ్రేణులు, ప్రజలకు ఆ పార్టీ ఉత్తరాంధ్ర రీజినల్ కోఆర్డినేటర్ కురసాల కన్నబాబు కృతజ్ఞతలు తెలిపారు. ఉత్తరాంధ్ర జిల్లాల వైఎస్సార్ సీపీ నాయకులతో శుక్రవారం నిర్వహించిన టెలీకాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో చేపట్టిన కోటి సంతకాల సేకరణను నర్సీపట్నం నుంచే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టారన్నారు. నవంబర్ 22వ తేదీ లోపు కోటి సంతకాల సేకరణ ప్రక్రియ పూర్తి చేయాలని పిలుపునిచ్చారు. ప్రతీ నియోజకవర్గంలో 50 నుంచి 60 వేల సంతకాల సేకరణ చేపట్టాలని, ప్రతీ గ్రామంలో 500 సంతకాలు తగ్గకుండా చూడాలని సూచించారు. ఈ నెల 28వ తేదీన ప్రతీ నియోజకవర్గంలో నిరసన కార్యక్రమం చేపట్టాలన్నారు. సంతకాల సేకరణ ప్రక్రియను నవంబర్ 22వ తేదీకి పూర్తి చేసి 23న ఎమ్మెల్యేలు, పార్టీ సమన్వయకర్తలు ఈ ప్రతులను పార్టీ జిల్లా అధ్యక్షుడికి పంపించాలన్నారు. నవంబర్ 26న పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో పాటు ముఖ్యనేతలు రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్‌ను కలిసి వీటిని అందజేస్తారన్నారు. సోషల్ మీడియా వేదికగా ఈ వినూత్న కార్యక్రమాన్ని ప్రచారం చేయాలని.. ఆ బాధ్యత సోషల్ మీడియా యాక్టివిస్టులు తీసుకోవాలని సూచించారు. మెడికల్ కళాశాల ప్రైవేటీకరణను ఉపసంహరించుకునే వరకూ పోరు ఆపకూడదన్నారు. జిల్లా, మండల, గ్రామ అనుబంధ విభాగాల కమిటీల నియామకం కూడా నవంబర్ 22 నాటికి పూర్తికావాలన్నారు. అలాగే కల్తీ మద్యంపై వైఎస్సార్ సీపీ మహిళా విభాగం ఆధ్వర్యంలో ఈనెల 13వ తేదీన నిరసన కార్యక్రమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. టెలీకాన్ఫరెన్స్‌లో ఉత్తరాంధ్ర జిల్లాల పార్టీ అధ్యక్షులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, సమన్వయకర్తలు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

పలు రైళ్ల రద్దు, మరికొన్ని గమ్యం కుదింపు

తాటిచెట్లపాలెం: వాల్తేర్ డివిజన్ పరిధిలో జరుగుతున్న పలు భద్రతాపనులు, ఆధునికీకరణ పనుల నిమిత్తం ఆయా మార్గాల్లో నడిచే పలు రైళ్లు ఆయా తేదీలలో రద్దు చేస్తున్నట్లు, మరికొన్ని గమ్యం కుదిస్తున్నట్లు వాల్తేర్ డివిజన్, సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ కే పవన్‌కుమార్ తెలిపారు.

రద్దు చేసిన రైళ్లు

- ఈ నెల 13వ తేదీన విశాఖ - బ్రహ్మపూర్ (18526) ఎక్స్‌ప్రెస్, విశాఖ-భువనేశ్వర్(22820) ఇంటర్‌సిటీ ఎక్స్ ప్రెస్, విశాఖ-బ్రహ్మపూర్(58532)పాసింజర్, ఈనెల 14న విశాఖ-బ్రహ్మపూర్(58532)పాసింజర్, భువనేశ్వర్-విశాఖ (22819)ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్, బ్రహ్మపూర్-విశాఖ (58531)పాసింజర్‌లు రద్దు చేశారు.

గమ్యం కుదించిన రైళ్లు...

ఈనెల 13న విశాఖ-పలాస (67289) మెము పాసింజర్ శ్రీకాకుళం రోడ్ వరకు మాత్రమే నడుస్తుంది. తిరుగు ప్రయాణంలో పలాసలో బయల్దేరవలసిన పలాస-విశాఖ(67290)మెము పాసింజర్ 13న పలాస నుంచి కాకుండా శ్రీకాకుళం రోడ్ నుంచి బయల్దేరుతుంది. శుక్రవారం నవంబరు 11వ తేదీ వరకు సోమ, మంగళ, శనివారాలలో విశాఖలో బయల్దేరే విశాఖ-బ్రహ్మపూర్(58532) పాసింజర్ పలాస వరకు మాత్రమే నడుస్తుంది.శుక్రవారం నుంచి నవంబరు 11వ తేదీ వరకు మంగళ, బుధ, ఆదివారాలలో బ్రహ్మపూర్‌లో బయల్దేరాల్సిన బ్రహ్మపూర్-విశాఖ (58531) పాసింజర్ బ్రహ్మపూర్ నుంచి కాకుండా పలాస నుంచి బయల్దేరుతుంది.

మనవడు మహా ముదురు

- కంచరపాలెంలో దోపిడీ ఇంటి దొంగ పనే..
- క్రైమ్ థ్రిల్లర్ సినిమాను తలదన్నేలా స్కెచ్ వేసిన కృష్ణకాంత్
- ఇంటి దొంగతో పాటు సహకరించిన ముగ్గురు స్నేహితుల అరెస్ట్
- రూ.2.1 లక్షలు, 12 తులాల బంగారం ఆభరణాలు, కారు స్వాధీనం



కేసుల వివరాలు వెల్లడిస్తున్న సీపీ శంఖబ్రత బాగ్చి, చిత్రంలో నిందితులు

విశాఖ సిటీ : క్రైమ్ థ్రిల్లర్ సినిమాను మించిన దోపిడీ కేసును పోలీసులు ఛేదించారు. కంచరపాలెంలో బామ్మ, మనవడిని కట్టేసి.. బంగారం, నగలు దోచుకున్నది ఇంటి దొంగే అని గుర్తించారు. ఈ దోపిడీలో మాస్టర్ మైండ్ మనవడే అన్నదే ఇక్కడ అసలు ట్విస్ట్. అప్పుల ఊబి నుంచి బయట పడేందుకు థ్రిల్లర్ సినిమాను తలదన్నేలా ముగ్గురి స్నేహితులతో కలిసి సొంతింట్లోనే దోపిడీకి పక్కాగా ప్లాన్ చేసి బంగారు ఆభరణాలు, నగదు దోచేశాడు. సాంకేతికత ఆధారంగా పోలీసులు దర్యాప్తు చేయగా అసలు విషయాన్ని తెలుసుకుని షాక్‌కు గురయ్యారు. తన సొంత ఇంటికే కన్నం వేసిన కృష్ణకాంత్ (19)తో పాటు అతని ముగ్గురు స్నేహితులు పరపతి ప్రమోద్ కుమార్ (30), షేక్ అభిషేక్ (21), అవసరాల సత్యసూర్యకుమార్ (24)లను అరెస్టు చేసినట్లు నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి తెలిపారు. శుక్రవారం పోలీస్ కాన్ఫరెన్స్ హాల్‌లో జరిగిన మీడియా సమావేశంలో ఆయన కేసు వివరాలను వెల్లడించారు. ఆయన చెప్పిన వివరాల ప్రకారం..

జీవీఎంసీలో కాంట్రాక్టు పనులు చేసే ఆనంద్‌రెడ్డి కుటుంబంతో కలిసి కంచరపాలెంలో ఇంద్రానగర్ 5వ వీధిలో నివాసముంటున్నాడు. ఇతడు ఈ నెల 4వ తేదీన శుభకార్యం కోసం హైదరాబాద్‌కు వెళ్లాడు. 5వ తేదీ రాత్రి సుమారు 12.30 గంటలకు గుర్తు తెలియని ముగ్గురు వ్యక్తులు ఇంటి వెనుక తలుపు పగలగొట్టి లోనికి ప్రవేశించారు. ఆ సమయంలో ఇంట్లో ఆనంద్‌రెడ్డి తల్లితో పాటు కుమారుడు ధర్మాల కృష్ణకాంత్ నిద్రలో ఉన్నారు. ఆగంతకులు బామ్మ, మనవుడ్ని ప్లాస్టర్, ప్లాస్టిక్ ట్యాగ్ వైర్లతో కట్టేసి నిర్బంధించారు. ఆమె ఒంటిపై ఉన్న 12 తులాల బంగారు ఆభరణాలు, మనవడి చేతికి ఉన్న డైమండ్ రింగ్, బీరువాలో ఉన్న రూ. 50 వేలు దోచుకున్నారు. తర్వాత ఇంటి ముందు పార్క్ చేసిన మహీంద్ర ఎక్స్‌యూవీ వాహనాన్ని కూడా దొంగలించి అక్కడ నుంచి పరారయ్యారు.

ఆన్‌లైన్ ట్రేడింగ్‌లో అప్పులపాలు

ప్రధాన నిందితుడు కృష్ణకాంత్ తండ్రి ఆనంద్‌రెడ్డిలా వ్యాపారంలో సక్సస్ అవ్వాలని ఆన్‌లైన్ ట్రేడింగ్ చేశాడు. ఇందులో భారీగా నష్టపోయాడు. అప్పులు తీర్చేందుకు స్నేహితులు పీఎం పాలెంకు చెందిన పరపతి ప్రమోద్ కుమార్, కేఆర్ఎం కాలనీకి చెందిన షేక్ అభిషేక్, మధురవాడకు చెందిన అవసరాల సత్య సూర్యకుమార్‌లతో కలిసి సొంత ఇంట్లోనే దొంగతనం చేయాలని ప్రణాళిక చేశాడు. వారం రోజుల ముందు వీరు సెల్ కాన్ఫరెన్స్‌లో నేరానికి ఏం ఉపయోగించాలి.. ఎలా తప్పించుకోవాలో ప్లాన్ చేశారు. ఇంట్లో ఉన్న సీసీ కెమెరాలు కూడా పని చెయ్యకపోవడంతో ఆ విషయం కూడా మాట్లాడుకుని నేరం చేస్తున్న సమయంలో హిందీ తప్ప మరే భాష మాట్లాడకూడదని నిర్ణయించుకున్నారు. ఈ సమయంలో కృష్ణకాంత్ తండ్రి ఆనంద్‌రెడ్డి హైదరాబాద్‌కు వెళ్లడంతో వీరు ఈ నెల 5వ తేదీ రాత్రికి ప్లాన్ అమలు చేయాలని నిర్ణయించుకున్నారు. అనుకున్న విధంగా బామ్మతో పాటు కృష్ణకాంత్‌ను కట్టేసి బంగారం, నగదు దోచుకున్నారు. అనంతరం ఇంటి ముందు పార్క్ చేసి ఉన్న ఆనంద్‌రెడ్డి కార్‌లో పరారయ్యారు. అక్కడి నుంచి ఎన్ఏడీ, గోపాలపట్నం, ప్రహ్లాదపురం, అడవివరం, హనుమంతవాక వైపు నుంచి మారికవలస వెళ్లి అక్కడ నిర్మానుష్య ప్రాంతంలో రోడ్డు పక్కన కారు వదిలి ఆటో ద్వారా ఆర్టీసీ కాంప్లెక్స్‌కు వచ్చారు. బస్సులో ముందు విజయవాడ, అక్కడి నుంచి హైదరాబాద్ పారిపోయారు.

నిందితులను చాకచక్యంగా పట్టుకున్న పోలీసులు

కేసు దర్యాప్తు కోసం నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి ఆదేశాల మేరకు డిప్యూటీ కమిషనర్ (క్రైమ్స్) లతా మాధురి ఆధ్వర్యంలో ఇన్‌చార్జ్ క్రైమ్ ఏసీపీ అన్నెపు నరసింహమూర్తి పర్యవేక్షణలో వెస్ట్ క్రైమ్ సీఐ మీసాల చంద్రమౌళి, ఎస్ఐ షేక్ అబ్దుల్ మరూఫ్, సీసీఎస్ సిబ్బందితో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు. నిందితుల కోసం ఒకవైపు నగరంలో గాలిస్తూనే మరోవైపు వారి మొబైల్ డేటాలో అనుమానాస్పద యాప్‌లు, ట్రేడింగ్‌కు సంబంధించిన హిస్టరీ, ప్లాస్టర్ సెర్చ్ హిస్టరీ వంటి ఆధారాలను గుర్తించారు. దీంతో పోలీసులు నిందితుల కోసం విజయవాడ, హైదరాబాద్‌లలో గాలించారు. పోలీసుల నుంచి తప్పించుకునే ప్రయత్నంలో నిందితులు తిరిగి విశాఖకు వచ్చి బంగారం, నగదు పంచుకుంటుండగా పోలీసులు వారిని పట్టుకున్నారు. వారి నుంచి రూ.2.1 లక్షలు, 12 తులాల బంగారు ఆభరణాలు, మహీంద్రా కారును స్వాధీనం చేసుకున్నట్లు సీపీ తెలిపారు.

'కళింగ'లో క్షిపణి నాణ్యత పరిశీలన

- అందుబాటులోకి అత్యాధునిక స్టాటిక్ ఫైరింగ్ ఫెసిలిటీ 'త్రినేత్ర'
- భీమిలిలో 'అగ్నివీరు'ల కోసం త్రీడీ బిల్డింగ్ నిర్మాణం



త్రినేత్ర సెంటర్‌ని ప్రారంభిస్తున్న ఈఎన్‌సీ చీఫ్ వైస్ అడ్మిరల్ పెంధార్కర్

సాక్షి, విశాఖపట్నం : వ్యూహాత్మక నేవల్ బేస్ ఐఎన్ఎస్ కళింగ అత్యాధునిక వ్యవస్థలకు కేంద్ర బిందువుగా మారింది. నావల్ వెపన్ సిస్టమ్స్‌ను పరీక్షించడానికి అత్యాధునిక స్టాటిక్ ఫైరింగ్ ఫెసిలిటీ 'త్రినేత్ర'ని తూర్పు నౌకాదళాధిపతి వైస్ అడ్మిరల్ రాజేష్ పెంధార్కర్ శుక్రవారం ప్రారంభించారు. నౌకాదళ ఆయుధ సంపత్తి నాణ్యత పరిశీలన, లైఫ్‌టైమ్ చెకింగ్ మొదలైన అంశాల కోసం... ఇప్పటి వరకూ ఫారిన్ ఒరిజినల్ ఎక్విప్‌మెంట్ మాన్యుఫ్యాక్చరర్స్ (ఓఈఎం)పైనే భారత నౌకాదళం ఆధారపడేది. ఇకపై భీమిలి కేంద్రంగా ఐఎన్ఎస్ కళింగలో ఏర్పాటు చేసిన త్రినేత్ర ద్వారా ఈ పరీక్షలు విజయవంతంగా నిర్వహించనున్నారు. క్షిపణులు, రాకెట్‌లు, ఆయుధాల సామర్థ్యమెలా ఉంది.? ఇంకా వాటి జీవిత కాలం ఎన్ని రోజులు ఉంటుంది.? మొదలైన పరిశీలనలు చేసే అత్యాధునిక సాంకేతికత త్రినేత్రలో ఏర్పాటు చేశారు. పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో ఇక్కడి పరికరాల్ని తయారు చేసినట్లు తూర్పు నౌకాదళ వర్గాలు చెబుతున్నాయి. స్టాటిక్ ఫైరింగ్ ఫెసిలిటీ సెంటర్‌లో క్షిపణులు, రాకెట్లు, సంబంధిత వ్యవస్థల కీలక పనితీరు వివరాల్ని నమోదు చేయడంతో పాటు.. రికార్డ్ కూడా చేసేలా రూపొందించారు. దీని ద్వారా.. నావల్ ఆర్మమెంట్ సిస్టమ్స్ పనితీరుకు సంబంధించి సమగ్రంగా అంచనా వెయ్యొచ్చు. ఆయుధ పరీక్ష మౌలిక సదుపాయాల కల్పనలో త్రినేత్ర ఒక ప్రధాన మైలురాయిగా నిలవనుంది.

త్రీడీ ప్రింటింగ్ భవనం : అదేవిధంగా తూర్పు నౌకాదళంలో ఇటీవల చేరిన అగ్నివీర్‌ల కోసం ప్రత్యేక భవనాన్ని ఐఎన్ఎస్ కళింగలోనే నిర్మించారు. అత్యాధునిక సాంకేతికతతో 3డీ ప్రింటింగ్ టెక్నాలజీతో ఈ భవనాన్ని నిర్మించారు. అగ్నివీర్‌ల వసతి కోసం ఈ భవనాన్ని వినియోగించనున్నారు.


మీ సంకల్పానికి సలాం

దివ్యాంగుల చేతిలో రూపుదిద్దుకున్న దీపావళి ప్రమిదలు









సీతంపేట: వైకల్యం.. శారీరకమైనా, మానసికమైనా కుంగిపోవాల్సిన పనిలేదు. ఇది తలరాత అని చింతించాల్సిన అవసరం అంతకంటే లేదు. చీకట్లను చీల్చుకుని వచ్చే కాంతి రేఖలా జీవితంలో ఎదగవచ్చని ఆ చిన్నారులు నిరూపిస్తున్నారు. ఓ వైపు అక్షరాలు దిద్దుతూనే మరోవైపు ఆదాయాన్ని ఆర్జిస్తున్నారు. తమ భవితకు బాటలు వేసుకుంటూ.. జీవితం వికసించేలా ప్రయత్నిస్తున్నారు. గెలుపు బాటలో పయనించేందుకు ఓర్పుతో ముందుకు సాగుతున్నారు. చిట్టి చేతులతో దీపావళికి రంగురంగుల ప్రమిదలను అద్భుతంగా తీర్చిదిద్దుతున్నారు. ఎంతో ఓపికతో నైపుణ్యత సాధించిన వారి సంకల్పానికి ఎవరైనా సలామ్ కొట్టాల్సిందే. మా విద్యార్థులు దివ్యాంగులు కాదు.. ప్రత్యేక సామర్థ్యం కలిగిన చిన్నారులు అంటూ వారి జీవితాన్ని రంగులమయం చేస్తోంది ప్రజ్వల్ వాణి వెల్ఫేర్ సొసైటీ.

అక్కయ్యపాలెం జగన్నాథపురంలో గల ప్రజ్వల్ వాణి వెల్ఫేర్ సొసైటీలో శిక్షణ పొందుతున్న దివ్యాంగ పిల్లలు అద్భుతమైన ప్రమిదలు తయారు చేసి అందరినీ ఆకట్టుకున్నారు. 'ఖుషీ దీప్' ప్రాజెక్టులో భాగంగా, చిన్నారులు మట్టి ప్రమిదలకు ఎరుపు, ఆకుపచ్చ, నీలం వంటి రంగులు అద్ది, కుందన్స్ అంటించి వాటిని ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. ఈ సందర్భంగా సొసైటీ వ్యవస్థాపకురాలు జేవీఎల్ సుచిత్ర మాట్లాడుతూ దివ్యాంగ పిల్లల్లో ఆత్మవిశ్వాసం, నైపుణ్యాలు పెంపొందించేలా ప్రతి ఏటా దీపావళి ప్రమిదలను వారి చేత తయారు చేయిస్తున్నట్టు తెలిపారు. తయారు చేసిన ఈ ప్రమిదలను నగరంలోని కళాశాలలు, పాఠశాలలు, మాల్స్, బీచ్ రోడ్, గేటెడ్ కమ్యూనిటీలలో ప్రదర్శించి, పిల్లల చేత విక్రయిస్తామన్నారు. ఇలా విక్రయించడం ద్వారా చిన్నారులలో సేల్స్ నైపుణ్యాలు, వృత్తిపరమైన శిక్షణ, స్వావలంబన పెంపొందుతాయని ఆమె వివరించారు.

● రా రమ్మని రారా రమ్మని... శిలలు పిలిచెను ఈ వేళ..



సాధారణంగా అప్పుడప్పుడు ఆటుపోటుల కారణంగా సముద్రం ముందుకు రావడం, వెనక్కి వెళ్లడం జరుగుతుంది. సముద్రం వెనక్కి వెళ్లినపుడు మాత్రమే రాళ్లు పైకి తేలి దర్శనమిస్తాయి. శుక్రవారం సంద్రం వెనక్కు వెళ్లింది. విశాఖ బీచ్‌కు వచ్చే సందర్శకులు వాటిపై ఫొటోలు, సెల్ఫీలు తీసుకుంటూ సందడిగా గడిపారు. రాళ్లు నాచు పట్టిఉండడం వల్ల మరింత అందంగా దర్శనమిచ్చాయి.

-ఫొటోలు : సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం



జీవీఎంసీ టౌన్‌ప్లానింగ్ ఓపెన్ ఫోరమ్‌కు 15 వినతులు

డాబాగార్డెన్స్: జీవీఎంసీలో శుక్రవారం నిర్వహించిన టౌన్‌ప్లానింగ్ ఓపెన్ ఫోరమ్‌కు 15 వినతులు వచ్చాయని జీవీఎంసీ చీఫ్ సిటీ ప్లానర్ ప్రభాకరరావు తెలిపారు. ప్రధాన కార్యాలయంలో సీపీలు, డీసీపీలు, ఏసీపీలతో కలిసి నిర్వహించిన ఓపెన్ ఫోరమ్‌లో ఆయన ఫిర్యాదులు స్వీకరించారు.

జీవన్ ప్రమాణ్ పోర్టల్ ద్వారా లైఫ్ సర్టిఫికెట్లు

మల్కాపురం: విశాఖ పోర్టు , డీఎల్‌బీ పెన్షనర్లు జీవన్ ప్రమాణ్ పోర్టల్ ద్వారా లైఫ్ సర్టిఫికెట్లు పొందాలని హార్బర్ అండ్ పోర్టు పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు చౌదరి అప్పారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఆధార్ కార్డు, ఫోన్ నంబర్, బ్యాంక్ అకౌంట్ నంబర్, పీపీవో నంబరు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. సిటిజన్స్ సర్వీస్ సెంటర్, బ్యాంకు, ఈ సేవ, మీ సేవల ద్వారా లైఫ్ సర్టిఫికెట్లు పొందవచ్చన్నారు. అలాగే పోర్టు ఏవోబీలోని సాంబమూర్తి ఆడిటోరియంలో ఈ సదుపాయం పొందవచ్చన్నారు.

ప్రభుత్వ భూమిలో టీడీపీ నాయకుల దౌర్జన్యం

- రూ.4 కోట్ల ప్రభుత్వ భూమిపై టీడీపీ కన్ను
- స్థలంలో దౌర్జన్యంగా మొక్కలు నాటిన వైనం



టీడీపీ నేతల చెరలో పందలపాక పంచాయతీలో సర్వే నంబర్ 71లో ఎకరా ప్రభుత్వ భూమి

తగరపువలస: ఆనందపురం మండలం పందలపాక పంచాయతీ బాకూరుపాలెం సర్వే నంబర్ 71లోని రూ.4 కోట్ల విలువైన ప్రభుత్వ భూమిలో టీడీపీ నేతల కన్ను పడింది. ఆ పార్టీ నేతలు వెన్ని రమణ, రాజు, సత్యవతి గతంలో దౌర్జన్యం చేసి నీలగిరి మొక్కలు వేశారు. అలాగే నెలరోజుల క్రితం అదే స్థలంలో మామిడిమొక్కలు వేయడానికి ప్రయత్నించగా గ్రామస్తులు అడ్డుకున్నారు. పందలపాక నుంచి తర్లువాడకు వెళ్లే మార్గంలో బాకూరుపాలెంలో ఉన్న ఈ విలువైన భూమిని గ్రామ అవసరాలకు వినియోగించుకునేందుకు నిర్ణయించుకున్నారు. ఈ స్థలంలో అంగన్వాడీ భవనాన్ని నిర్మించుకునేందుకు పంచాయతీ పాలకవర్గం ఎం బుక్‌లో కూడా రికార్డు చేసింది. మళ్లీ మూడు రోజుల క్రితం టీడీపీ నాయకులు ఇదే స్థలంలో ట్రాక్టర్లతో దున్ని మొక్కలు వేయడానికి ప్రయత్నించగా వీఆర్వో దుర్గా రమేష్ అడ్డుకున్నారు. ఈ స్థలంపై టీడీపీ నాయకులతో విబేధాల కారణంగా ఇది వరకే బాకూరుపాలెం గ్రామస్తులు సవాల్ చేస్తూ న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. తీర్పు వెలువడవలసి ఉండగా నాయకులు టీడీపీలో ప్రముఖుల పేర్లు చెపుతూ దౌర్జన్యం చేస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఇదిలావుండగా కబ్జాకు పాల్పడుతున్న వారు టీడీపీకి చెందినవారు కాదని పంచాయతీకి చెందిన ఆ పార్టీ నాయకులు తప్పించుకు తిరుగుతున్నారు. కోర్టు వివాదంలో ఉన్న ఈ విలువైన స్థలంలో తరచూ టీడీపీ నాయకులు దౌర్జన్యానికి పాల్పడుతూ గ్రామంలో అశాంతి కలిగిస్తున్నా ఆనందపురం రెవెన్యూ అధికారులు పట్టనట్టు వ్యవహరిస్తున్నారని బాకూరుపాలెం ప్రజలు వాపోతున్నారు. విలువైన స్థలాన్ని గ్రామ అవసరాలకే ఉపయోగపడాలంటున్నారు. అధికార పార్టీ అండ చూసుకుని ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమిస్తే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు.

ఈ విషయాన్ని పందలపాక వీఆర్వో దుర్గా రమేష్ దృష్టికి మరోమారు తీసుకురాగా కోర్టు తీర్పు పెండింగ్‌లో ఉన్నందునే జోక్యం చేసుకోలేకపోతున్నామన్నారు. ఈ విషయాన్ని తహసీల్దార్ శ్రీనుబాబు దృష్టికి తీసుకువెళ్లానన్నారు. వెన్ని కుటుంబ సభ్యులు తమ వద్ద ఈ స్థలానికి సంబంధించి పట్టాలు ఉన్నాయన్నారన్నారు. కానీ అవి తమ వద్ద ఉన్న రికార్డులతో సరిపోవడం లేదన్నారు. మూడు రోజుల క్రితం సర్వే నంబర్ 71లో దున్నడానికి వస్తే అడ్డుకున్నామన్నారు. కోర్టు తీర్పు వచ్చే వరకు ఈ స్థలంలో ఎలాంటి మొక్కలు, నిర్మాణాలు చేపట్టకూడదన్నారు.

గంటా ఇంటి వద్ద వీధివ్యాపారుల నిరసన

ఎంవీపీకాలనీ: ఎంవీపీ కాలనీ సెక్టార్–4లోని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఇంటి ఎదుట వీధివ్యాపారులు నిరసన చేపట్టారు. శుక్రవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఈ నిరసన కార్యక్రమం జరిగింది. మధురవాడలో ఫుట్‌పాత్‌లను ఆనుకొని ఉన్న దుకాణాలను ఇటీవల జీవీఎంసీ తొలగించడాన్ని వ్యతిరేకిస్తూ చిరు వ్యాపారులు ఆందోళన వ్యక్తం చేశారు. భీమిలి జోన్‌కు చెందిన వీధి వ్యాపారులు సీఐటీయూ ఆధ్వర్యంలో ప్రభుత్వానికి, జీవీఎంసీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. జీవీఎంసీ వీధివ్యాపారుల పొట్ట కొట్టిన నేపథ్యంలో భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు దీనికి సమాధానం చెప్పాలని నిలదీశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జోన్ ఇన్‌చార్జి వెంకటరావు మాట్లాడుతూ విశాఖలో వీధివ్యాపారుల చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్రం అందుబాటులోకి తెచ్చిన 2014 స్ట్రీట్ వెండర్స్ చట్టం వీధివ్యాపారులకు రక్షణ కల్పిస్తున్నప్పటికీ, జీవీఎంసీ నియంతగా వ్యవహరిస్తోందన్నారు. షాపులు తొలగిస్తే నగరంలోని వీధివ్యాపారులంతా తమ కుటుంబాన్ని ఎలా పోషించుకోవాలంటూ ప్రశ్నించారు. స్మార్ట్‌సిటీ పేరుతో విశాఖను పెద్ద వ్యాపారస్తులకు కట్టబెట్టేందుకు జీవీఎంసీ కొనసాగిస్తున్న నియంతృత్వ విధానం సరికాదన్నారు. ఇప్పటికైనా విశాఖలోని ప్రజాప్రతినిధులు ఈ సమస్యపై స్పందించి, వీధివ్యాపారులకు న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.



గంటా ఇంటి వద్ద బైఠాయించిన భీమిలి నియోజకవర్గ చిల్లర వర్తకులు

బంగారంలాంటి మాట.. అనసూయ నోట..



మాట్లాడుతున్న సినీనటి అనసూయ

ఏయూక్యాంపస్: బంగారం కేవలం మహిళలకు అలంకరణకు ఉపకరించే ఆభరణం మాత్రమే కాదని కుటుంబాలకు ఆర్థిక భరోసాను కూడా ఇస్తుందని సినీనటి అనసూయ భరద్వాజ్ అన్నారు. బీచ్‌రోడ్డులో ఓ హోటల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ మహిళలకు బంగారు ఆభరణాలు ధైర్యాన్ని, భరోసాను కల్పిస్తాయన్నారు. కుటుంబంలో ఆర్థిక అవసరాలకు పేద, మధ్యతరగతి వర్గాల ప్రజలకు బంగారం ఒక విలువైన ఆసరాగా నిలుస్తుందన్నారు. ఆర్థిక అవసరాలకు, పెట్టుబడికి బంగారం ఒక మార్గంగా నిలుస్తోందన్నారు. విశాఖ నగరం అంటే తనకు ఎంతో ఇష్టమని, ఎప్పుడు వచ్చినా ఇక్కడ రెండు,మూడు రోజులు ఉండటానికి ఇష్టపడతానన్నారు.

రౌడీషీటర్ దారుణ హత్య!

- 7వ తేదీ రాత్రి సీతమ్మధార ఆక్సిజన్ టవర్స్ వద్ద ఘటన
- యలమంచిలిలో మృతదేహాన్ని గుర్తించిన పోలీసులు



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎంవీపీ సీఐ ప్రసాద్

ఎంవీపీకాలనీ : ఇద్దరు రౌడీషీటర్ల మధ్య చోటుచేసుకున్న వాగ్వాదం ఒకరి హత్యకు దారి తీసింది. ఈ నెల 7వ తేదీ రాత్రి సీతమ్మధారలోని ఆక్సిజన్ టవర్స్ వద్ద జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. దీనిపై ఎంవీపీ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కోింకోట శ్రీధర్, గౌరీశంకర్ పాతనేరస్తులు. శ్రీధర్‌పై విజయవాడలో, గౌరీశంకర్‌పై యలమంచిలిలో రౌడీషీట్లు ఉన్నాయి. వీరు పలు నేరాల్లో నిందితులు కాగా విశాఖలోని త్రీటౌన్, పీఎం పాలెం పోలీసు స్టేషన్ల పరిధిలో సైతం గతంలో కేసులు నమోదయ్యాయి. ఆ కేసుల్లో భాగంగా ఈ నెల 7వ తేదీన ఇద్దరు విశాఖ జిల్లా కోర్టుకు వాయిదాకు హాజరయ్యారు. అనంతరం కారులో నగరమంతా తిరుగుతూ మద్యం సేవించారు. 7వ తేదీ రాత్రి 2 గంటల సమయంలో (8వ తేదీ తెల్లవారి) సీతమ్మధార ఆక్సిజన్ టవర్స్ సమీపంలో ఓ మహిళ విషయమై వారి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఇది ఘర్షణకు దారి తీయడంతో గౌరీశంకర్ శ్రీధర్‌పై దాడిచేసి పలు చోట్ల కత్తితో గాయపరిచాడు. నరాలు తెగి విపరీతంగా రక్తస్రావం కావడంతో శ్రీధర్ స్పృహ కోల్పోయాడు. మద్యం మత్తులో ఉన్న గౌరీశంకర్ కారులో శ్రీధర్‌ను వేసుకొని యలమంచిలి వైపు బయలుదేరాడు. ఉదయం 6 గంటలకు యలమంచిలి వద్ద పరిశీలించగా శ్రీధర్ మరణించినట్లు గుర్తించాడు. దీంతో కాళ్లు, చేతులు కట్టేసి యలమంచిలిలోని పోలవరం కెనాల్‌లోకి మృతదేహాన్ని విసిరేసి అక్కడి నుంచి పరారయ్యాడు. వేరే కేసులో ఈ నెల 9న పోలీసులు గౌరీశంకర్‌ను విచారిస్తున్న సయయంలో ఈ హత్యోదంతం వెలుగు చూసినట్లు ఎంవీపీ సీఐ ప్రసాద్ తెలిపారు. శుక్రవారం ఉదయం పరిశీలించగా బాడీ లభ్యమైందన్నారు. మృతదేహాన్ని శవ పరీక్ష నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. ఈ ఘటనపై శ్రీధర్ కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వెల్లడించారు.

ధాన్యం సేకరణపై అప్రమత్తంగా ఉండాలి

మహారాణిపేట : ఖరీఫ్ కాలంలో 2025–26లో ధాన్యం సేకరణపై ఆయా శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండి రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ కోరారు. కలెక్టరేట్‌లో జిల్లాలో ఖరీఫ్ సీజన్‌లో 40 రైతు సేవ కేంద్రాల ద్వారా 10,000 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యంగా నిర్దేశించినట్టు తెలిపారు. ధాన్యం కనీస మద్దతు ధర సాధారణ రకం(కామన్), క్వింటా రూ.2,369, ఏ గ్రేడ్ రకం క్వింటా రూ.2,389గా నిర్ణయించినట్టు పేర్కొన్నారు. గత ఏడాది మద్దతు ధర కన్నా రూ.69 అదనంగా చెల్లించనున్నట్టు తెలిపారు. ధాన్యం విక్రయంలో రైతులకు ఎటువంటి ఇబ్బందులు ఎదురైనా టోల్‌ఫ్రీ నెంబర్ 1967కు ఫిర్యాదు చేయవచ్చన్నారు. జిల్లా కంట్రోల్ నెంబర్ (7702003581)ను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. సమావేశంలో సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ జిల్లా మేనేజర్ ఎం.శ్రీలత, డీఎస్‌వో భాస్కర రావు, జిల్లా వ్యవసాయ అధికారి అప్పలస్వామి తదితరులు పాల్గొన్నారు.